సాక్షి
కామారెడ్డి
ఆదివారం । 26 । ఫిబ్రవరి । 2023



కుక్కల సమస్యను పరిష్కరిస్తాం
బాన్సువాడలో కుక్కల సమస్యను పరిష్కరిస్తామని మున్సిపల్ కమిషనర్ రమేశ్ పేర్కొన్నారు. 'సాక్షి' ఫోన్‌ఇన్‌లో మాట్లాడారు.
- 8లో ▸



అర్థంకాని ఆదాయ వ్యయాలు
మున్సిపల్ బడ్జెట్‌ను శనివారం ప్రవేశపెట్టగా ఆదాయవ్యయాలు అర్థం కాగా సభ్యులు విస్మయం చెందారు.
- 8లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
36.4 /19.3

వాతావరణం
ఆకాశం నిర్మలంగా ఉంటుంది. ఉదయం నుంచే ఎండ తీవ్రత పెరుగుతుంది. మధ్యాహ్నం వడగాలులు వీస్తాయి. రాత్రి చలిగా ఉంటుంది.

కుక్కల బెడదపై మున్సిపల్ కమిషనర్‌తో ఫోన్‌ఇన్

ఎల్లారెడ్డి మున్సిపాలిటీ



జగ్జీవన్, మున్సిపల్ కమిషనర్, ఎల్లారెడ్డి

ఎల్లారెడ్డి మున్సిపాలిటీ పరిధిలో ఇటీవల విపరీతంగా పెరిగిన కుక్కల సంతతి, పారిశుధ్యం, ఇతర సమస్యలపై ఎల్లారెడ్డి మున్సిపల్ కమిషనర్‌తో ఆదివారం సాక్షి ఫోన్‌ఇన్ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది. ప్రజలు తమ సమస్యలు, ఇబ్బందుల గురించి ఫోన్ చేసి మాట్లాడొచ్చు.

తేది : 26-2-2023 (ఆదివారం)
సమయం: ఉదయం 10 గంటల నుంచి 11 గంటల వరకు..
సాక్షి ఫోన్ ఇన్
91334 49496
ఫోన్ చేయాల్సిన నంబర్

న్యూస్‌రీల్

ధరణి టౌన్‌షిప్‌లో వసతులు కల్పించాలి



కామారెడ్డి క్రైం : పదిరోజుల వ్యవధిలో జిల్లా కేంద్రంలోని అడ్లూర్ శివారులో ఉన్న ధరణి టౌన్‌షిప్‌లో అన్ని మౌలిక వసతులు కల్పించాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అధికారులకు సూచించారు. ధరణి టౌన్‌షిప్‌లో మౌలిక వసతుల కల్పనపై అధికారులతో శనివారం సమీక్ష జరిపారు. విద్యుత్ సౌకర్యం, అంతర్గత రోడ్లు, రక్షణ ప్రహరీ నిర్మాణం పనులు పూర్తి చేయాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు.ఆర్డీవో శ్రీనివాస్ రెడ్డి, ధరణి టౌన్‌షిప్, మున్సిపల్, ఆర్‌అండ్‌బీ, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌జెండర్లు అందరితో సమానం



కామారెడ్డి క్రైం : సమాజంలో అందరితో ట్రాన్స్‌జెండర్లు సమానమేనని జిల్లా న్యాయసేవ అధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి డి కిరణ్ కుమార్ అన్నారు. కామారెడ్డి కలెక్టరేట్‌లో శనివారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, సఖి కేంద్రం ఆధ్వర్యంలో ట్రాన్స్‌జెండర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రాన్స్‌జెండర్లు చదువుకొని ఉద్యోగాలు సాధించాలని, చిన్న,చిన్న వ్యాపారాలు చేస్తూ స్వయం ఉపాధి పొందాలన్నారు. అనంతరం కలెక్టర్ జితేష్ వి పాటిల్ మాట్లాడారు. ట్రాన్స్‌జెండర్లు జీవనం కోసం ఇప్పటివరకు చేస్తున్న పనులు మానుకొని వస్తే నైపుణ్య శిక్షణను ఇచ్చి ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. వారికి ఆధార్ కార్డు, రేషన్ కార్డు వంటి సౌకర్యాలు కల్పిస్తామన్నారు. సఖి కేంద్రం ద్వారా లబ్ధి పొందుతున్న మహిళలను అభినందించారు. జిల్లా న్యాయ సేవా సంస్థ పర్యవేక్షకుడు చంద్రసేనారెడ్డి, సఖి కేంద్రం పరిశీలకురాలు భారతి తదితరులున్నారు.

మెడికో ఆత్మహత్య కలకలం

- బలవన్మరణానికి పాల్పడిన వైద్య కళాశాల విద్యార్థి
- హాస్టల్‌లో ఉరేసుకున్న హర్ష
- మంచిర్యాల జిల్లా చింతగూడ వాసి
- వైద్యవర్గాల్లో తీరని విషాదం

జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ వైద్య కళాశాల విద్యార్థి హర్ష బలవన్మరణం చెందడం కలకలం రేపింది. ఈ ఘటన వైద్య వర్గాల్లో తీరని విషాదం నింపింది. అయితే విద్యార్థి ఆత్మహత్యకు గల బలమైన కారణం తెలియరాలేదు. గతేడాది కాలంగా కళాశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు వివిధ కారణాలతో మృతి చెందారు. వరుస మరణాలు ఆందోళన కలిగిస్తున్నాయి.

నిజామాబాద్‌సిటీ/నిజామాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాల(జీఎంసీ) ఫైనలియర్ విద్యార్థి హర్ష ఆత్మహత్యా జిల్లాలో కలకలం రేపింది. కళాశాల విద్యార్థులు, వైద్యవర్గాల్లో తీవ్ర విషాదం నెలకొల్పింది. మంచిర్యాల జిల్లా జన్నారం మండలం చింతగూడకు చెందిన హర్ష శనివారం హాస్టల్‌లో ఉరివేసుకుని బలవన్మరణం చెందాడు. హర్ష ఏడాదిగా నడుము నొప్పితో బాధపడుతున్నాడు. శుక్రవారం పరీక్ష రాసిన తర్వాత ఎంఆర్ఐ స్కానింగ్ తీయించుకున్నాడు. రాత్రి 9 గంటలకు అందరితో కలిసి భోజనం చేసి, తోటి మెడికోలతో కలిసి చదువుకున్నాడు. 10 గంటలకు తన గదికి వెళ్తూ తెల్లవారుజామున 3 గంటలకు నిద్రలేపాలని స్నేహితుడు తరుణ్‌తో చెప్పి వెళ్లాడు. 10 గంటల తర్వాత మళ్లీ తరుణ్ హర్ష గది వద్దకు వెళ్లి పిలవగా పలకలేదు. పడుకున్నాడని భావించి తరుణ్ వెళ్లిపోయాడు. ఉదయం 3 గంటలకు వెళ్లి పిలవగా స్పందనలేదు. ఉదయం 7 గంటలకు పరీక్ష సమయం అవుతుండడంతో హర్షను నిద్ర లేపేందుకు ప్రయత్నం చేశాడు. స్పందించక పోవడంతో తోటి విద్యార్థులకు చెప్పాడు. అక్కడే ఉన్న మెస్ ఇన్‌చార్జిలు వచ్చారు. తలుపును బలవంతంగా తెరిచి చూడగా హర్ష ఫ్యాన్‌కు ఉరేసుకుని కనిపించాడు. వెంటనే విషయాన్ని కళాశాల ప్రిన్సిపల్ ఇందిరాకు తెలపగా ఆమె వచ్చారు. విషయాన్ని వన్‌టౌన్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు వచ్చి హర్ష మృతదేహాన్ని కిందకు దించి తల్లికి సమాచారం అందించారు. తల్లి రాధ, మేనమామ మధుకర్‌లు వచ్చాక మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు. అనంతరం మెడికోలో హర్షకు కొవ్వొత్తులతో నివాళులర్పించారు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు ఒకటో టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.



కొడుకు మృతితో కన్నీరు మున్నీరవుతున్న తల్లి రాధ





హాస్టల్ గదిలో హర్ష మృతదేహం, ఇన్‌సెట్‌లో(ఫైల్ ఫొటో)

ఏడాదిలో ముగ్గురు విద్యార్థుల మృతి

- కలవరపెడుతున్న వరుస మరణాలు
- తాజాగా ఎంబీబీఎస్ ఫైనలియర్ విద్యార్థి ఆత్మహత్య
- గతేడాది మేలో విధుల్లోనే మరణించిన పీజీ విద్యార్థిని
- రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన మరొక స్టూడెంట్
- ఆందోళన చెందుతున్న విద్యార్థులు

నిజామాబాద్‌అర్బన్: నగరంలో ప్రభుత్వ మెడికల్ కళాశాల(జీఎంసీ) విద్యార్థుల వరుస మరణాలు కలవరపెడుతున్నాయి. కారణాలేమైనా ఏడాదిలో ముగ్గురు మృతిచెందడం ఆందోళన కలిగిస్తోంది. తాజాగా శనివారం ఎంబీబీఎస్ విద్యార్థి హర్ష ఆత్మహత్యకు పాల్పడడం కలకలం రేపింది.

మరో ఇద్దరు..

గత ఏడాది కాలంలో కళాశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు మరణించారు. తాజాగా హర్ష ఆత్మహత్య చేసుకోగా.. 2022లో కళాశాలకు చెందిన పీజీ రెండో సంవత్సరం విద్యార్థి రోహిత్ రెడ్డి ఆర్మూర్ మండలం అంకాపూర్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించాడు. దీంతో కళాశాలలో విషాద చాయలు నెలకొన్నాయి. అంతేగాక 2022 మే 13న పీజీ విద్యార్థిని శ్వేత గైనిక్ విభాగంలో వైద్య సేవలు అందిస్తూ రాత్రి ఆకస్మికంగా మరణించింది. ఈ ఘటన కళాశాలలో కలకలం రేపింది. విధుల్లో ఉన్న గైనిక్ వైద్యురాలు ఆకస్మికంగా మరణించడంతో కుటుంబీకులు వైద్యాధికారులు, తోటి విద్యార్థులు చలించిపోయారు. అయితే విద్యార్థులు శ్వేత, హర్ష మరణాలు అనుమానాస్పదంగానే మిగిలిపోయాయి. తోటి విద్యార్థులతో బాగానే ఉండి ఉన్నట్టుండి మరణించడంపై అధికారులు ఆందోళన చెందుతున్నారు. ఒత్తిడి వల్ల మరణిస్తున్నారా.. వేరే కారణాలు ఉన్నాయా అనేది తెలియడంలేదు.

ఒత్తిళ్లు, ఇబ్బందులుంటే తెలపాలి



విద్యార్థి హర్ష శుక్రవారం రాత్రి ఫ్రెండ్స్‌తో కలిసి కంబైడ్ స్టడీ చేశాడు. తర్వాత ఎవరి రూమ్‌లోకి వారు వెళ్లిపోయారు. ఉదయం ఫ్రెండ్స్ బ్రేక్‌ఫాస్ట్ కోసం హర్ష గదికి వెళ్లి పిలిచారు. స్పందన రాకపోవడంతో తలుపులు తెరిచి చూడగా ఉరి వేసుకుని కనిపించాడు. హర్ష మంచి స్టూడెంట్. అతనిపై ఎలాంటి రిమార్క్ లేదు. ఆత్మహత్యకు కారణాలు తెలియరాలేదు. విద్యార్థులు ఇబ్బందులుంటే మాకు తెలపాలి. ఒత్తిడికి గురికావద్దు. విద్యార్థులకు ప్రొఫెసర్లు అందుబాటులో ఉంటారు. ఇలాంటి ఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకుంటాం. – డాక్టర్ ఇందిర, కళాశాల ప్రిన్సిపాల్

మిన్నంటిన తల్లి రోదనలు

- అందర్నీ కలిచివేసిన ఘటన
- కంటతడి పెట్టిన తోటి విద్యార్థులు

నిజామాబాద్ సిటీ/నిజామాబాద్‌అర్బన్: హర్ష మృతి వార్త తెలియగానే హాస్టల్‌కు చేరుకున్న తల్లి రాధ కొడుకు మృతదేహం వద్ద కన్నీటి పర్యంతమైంది. గుండెలు బాదుకుంటూ విలపించడం అందర్నీ కలిచివేసింది. తన కొడుకు ప్రతిరోజూ ఫోన్‌లో మాట్లాడేవాడని, అమ్మ నేను డాక్టర్ అవుతున్నా.. నీకు ఇల్లు కటిస్తా.. కారు కొనిస్తా అంటూ తన కుమారుడు మూడు రోజుల క్రితమే ఫోన్‌లో ఎంతో సంబరంగా చెప్పాడని.. మార్చి 15 తర్వాత ఇంటికి వస్తానని చెప్పాడని.. ఇంతలోనే ఆత్మహత్య చేసుకున్నాడని తల్లి రోదించింది. ప్రస్తుతం ఫైనలియర్ పరీక్షలు జరుగుతున్నాయని అయిపోగానే ఇంటికి వస్తానని.. అందరం కలిసి బంధువుల పెళ్లికి వెళ్దామని చెప్పాడని.. ఇంతలోనే ఇలా చూస్తాను అనుకోలేదని ఆమె గుండెలవిసేలా రోదించింది. నాలుగు రోజుల క్రితం హర్ష ఫోన్ చేసి స్కానింగ్ కోసం డబ్బులు లేవని చెప్పగా, తాను పంపిస్తానని ఎలాంటి బెంగ పెట్టుకోవద్దని తెలిపినట్టు తల్లి విలపిస్తూ చెప్పింది.

రెండు పరీక్షలు రాసి..

హర్ష ఎంబీబీఎస్ ఫైనల్ ఇయర్ జనరల్ మెడిసిన్ పేపర్ -1, పేపర్ 2 పరీక్షలు రాయగా, శనివారం సర్జికల్ విభాగం పేపర్లు రాయల్సి ఉంది. ఇంతలోనే ఈ అఘాయిత్యానికి పాల్పడ్డాడు. ఎంబీబీఎస్ మొదటి సంవత్సరంలో 74శాతం, రెండో సంవత్సరంలో 81శాతం, మూడో సంవత్సరంలో 76శాతం, నాల్గో సంవత్సరంలో 78శాతం మార్కులు సాధించాడు.

మలేషియాలో తండ్రి..

జన్నారం(ఖానాపూర్): ఉపాధి కోసం మలేషియా వెళ్లిన తండ్రి శ్రీనివాస్‌కు కొడుకు చనిపోయాడనే విషయం తెలిసి కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నాడు. విదేశాల్లో పని చేస్తే కొడుకులు చదివి ప్రయోజకులు అవుతారని అనుకుంటే ఇలా జరగడం జీర్ణించుకోలేకపోతున్నాడు. నెల రోజుల క్రితమే శ్రీనివాస్ మలేషియా వెళ్లడంతో ఇక్కడికి పంపించడం కష్టమేనని బంధువులు అంటున్నారు. అంత్యక్రియలకు హాజరు కాడని చెబుతున్నారు. హర్ష మరణవార్త విన్న ఆయన మేనమామ శ్రీనివాస్ దుబాయ్ నుంచి బయలు దేరాడని తెలిపారు. ఆయన అంత్యక్రియలకు హాజరవుతారని పేర్కొంటున్నారు. కుటుంబ సభ్యులతోపాటు వైస్ ఎంపీపీ వినయ్‌కుమార్, సర్పంచ్ భర్త ఆరే శిరీష్ తదితరులు హర్ష మృతదేహాన్ని తీసుకురావడానికి నిజామాబాద్ వెళ్లారు. ఎంబీబీఎస్ విద్యార్థి దాసరి హర్ష(22) ఆత్మహత్య చేసుకోవడంతో స్వగ్రామం చింతగూడలో విషాదం నెలకొంది. గ్రామానికి చెందిన దాసరి శ్రీనివాస్, రాధ దంపతులకు కుమారులు హర్ష, ధనుష్ ఉన్నారు.

చురుకైన విద్యార్థి..

హర్ష ఒకటో తరగతి నుంచి ఏడో తరగతి వరకు జన్నారంలోని జయరాణి పాఠశాలలో చదివాడు. ఎనిమిది నుంచి పదో తరగతి వరకు మంచిర్యాలలోని ప్రైవేటు పాఠశాలలో అభ్యసించాడు. పదో తరగతిలో 10జీపీఏ సాధించి హైదరాబాద్‌లోని శ్రీచైతన్య కళాశాలలో ఇంటర్మీడియెట్ బైపీసీ 908 మార్కులతో ఉత్తీర్ణుడయ్యాడు. నీట్‌లో 1320వ ర్యాంకు సాధించి జనరల్ కోటాల నిజామాబాద్‌లోని మెడికల్ కాలేజీలో సీటు సాధించాడు. చిన్నప్పటి నుంచే చదువులో చురుగ్గా ఉండే హర్ష మెడికల్ కళాశాలలోనూ చురుగ్గా ఉండేవాడు.



హర్షకు నివాళులర్పిస్తున్న ప్రొఫెసర్లు, విద్యార్థులు

నివాళులర్పించిన వైద్య విద్యార్థులు

హర్ష మృతి చెందటంతో తోటి విద్యార్థులు విషాదంలో మునిగారు. నిన్నటివరకు తమతో సంతోషంగా గడిపిన హర్ష తెల్లారే సరికి విగతజీవిగా పడి ఉండటంతో షాక్‌కు గురయ్యారు. విద్యార్థులు, కళాశాల ప్రిన్సిపాల్ ఇందిరా, ఆస్పత్రి సూపరింటెండెంట్ ప్రతిమారాజ్ నివాళులు అర్పించారు. ఆస్పత్రి నుంచి బయట వరకు కొవ్వొత్తులతో ర్యాలీగా వెళ్లారు.



హాస్టల్ ఎదుట విద్యార్థి సంఘాల నాయకుల బైఠాయింపు

ఎప్పుడు కలిసి ఉండేవాడు..



హర్షకు ఎలాంటి ఇబ్బందులు లేవు. మాతో ఎప్పుడు కలిసి ఉండేవాడు. చదువులో ముందుండేవాడు. ఆత్మహత్య చేసుకోవటం మమ్ముల్ని కలచివేసింది. నడుం, వెన్ను నొప్పి ఉండటంతో ఎంఆర్ఐ స్కానింగ్ తీయించుకున్నాడు. పొద్దున డాక్టర్ వద్దకు వెళ్లాలని చెప్పాడు. ఇంతలోనే ఈ ఘోరం జరిగింది.
– చతుర్వేదం, విద్యార్థి

రాత్రి వరకు కలిసే చదువుకున్నాం



శుక్రవారం రాత్రి భోజనం చేశాక గంట వరకు కలిసే చదువుకున్నాం. రాత్రి 10 గంటల తర్వాత ఎవరి గదికి వారు వెళ్లిపోయాం. తెల్లవారుజామున 3 గంటలకు తనను నిద్రలేపాలని హర్ష చెప్పాడు. లేపేందుకు గదికి వెళ్తే స్పందించలేదు. మళ్లీ ఉదయం 7 గంటలకు పిలిచిన పలకలేదు. పరీక్షకు సమయం అవుతుండటంతో ఫోన్ చేసిన స్పందించలేదు. విషయాన్ని హాస్టల్ సిబ్బందికి తెలుపగా తలుపును బలవంతంగా తెరిచి చూడగా హర్ష ఉరేసుకుని చనిపోయాడు.
– తరుణ్, విద్యార్థి

ఎలాంటి ఇబ్బందులు లేవు



హర్షకు ఆత్మహత్య చేసుకునేంత ఇబ్బందులు లేవు. మాతో బాగానే మాట్లాడేవాడు. నడుం, వెన్ను నొప్పి ఉండేదని గతంలో హైదరాబాద్‌లో చికిత్స తీసుకున్నాడు. పరీక్షలు కాగానే ఇంటికి వస్తానని చెప్పాడు. ఇంతలోనే ఆత్మహత్య చేసుకున్నట్లు ఫోన్ వచ్చింది. దాంతో నిజామాబాద్‌లో ఉన్న మా బంధువులను ఇక్కడకు పంపాం. దీని వెనుకాల కారణాలు తెలుసుకోవాలి. మా కుటుంబంలో ఒక డాక్టర్ అవుతున్నాడనే సంతోషంగా ఉన్నాం. కానీ ఇలా జరగటం మా దురదృష్టం. – మధుకర్, హర్ష మేనమామ

ప్రపంచ దేశాల ఆశాకిరణం భారత్

- జీ20 సదస్సుకు ఆతిథ్యం ఇవ్వడం గర్వకారణం
- రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్
- తెలంగాణ వర్సిటీలో జాతీయ సదస్సు



సదస్సులో ప్రసంగిస్తున్న రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్



సదస్సులో పాల్గొన్న అధ్యాపకులు, విద్యార్థులు

తెయూ(డిచ్‌పల్లి): ఇదివరకు ప్రపంచ దేశాల నుంచి అన్ని వస్తువులను దిగుమతి చేసుకునే భారత్ ప్రస్తుతం ఒక శక్తివంతమైన దేశంగా ఎదుగుతూ ప్రపంచ దేశాల భవిష్యత్ ఆశాకిరణంగా మారిందని రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ అన్నారు. తెలంగాణ వర్సిటీ, అఖిలభారతీయ రాష్ట్రీయ శైక్షిక్ మహాసంఘ్ ఆధ్వర్యంలో శనివారం 'ఇండియాస్ జీ-20 ప్రెసిడెన్సీ, ఆపర్చునిటీస్ అండ్ చాలెంజెస్ ఫర్ ఇండియా యాజ్ ది గ్లోబల్ లీడ ర్' అనే అంశంపై నిర్వహించిన జాతీయ సదస్సును గవర్నర్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం గవర్నర్ మాట్లాడుతూ.. భారతదేశం జీ-20 దేశాల సదస్సుకు నేతృత్వం వహించడం మనకు గర్వకారణమన్నారు. 85శాతం అంతర్జాతీయ స్టార్టప్ కంపెనీలు మన దేశ సహకారం కోసం ఎదురుచూస్తున్నాయన్నారు. కరోనా మహమ్మారిని తట్టుకొని వాక్సినేషన్‌ను తయారుచేసి దాదాపు 150 దేశాలకు సరఫరా చేసిన ఘనత భారత్‌కు దక్కిందన్నారు. ఇదేగాక రుబెల్లా, పోలియో వ్యాధులకు వాక్సిన్ తయారు చేసి ప్రాణాంతమైన వ్యాధులకు చికిత్సను అందిస్తుందన్నారు. ఒకే భూమి, ఒకే కుటుంబం, ఒకే భవిష్యత్తు వంటి అనే నినాదంతో భారతదేశం సర్వస్వతంత్ర దేశంగా ఎదుగుతుందన్నారు. పెద్దవాళ్లను గౌరవించడం, వర్తమాన పరిస్థితులకు అనుగుణంగా అవసరాలను తీర్చడం, భవిష్యత్ తరాలకు బంగారుబాటను అందించడం భారతదేశంపై ఉన్న ఒక బాధ్యత అని పేర్కొన్నారు. భారతీయ ధార్మిక, ఆధ్యాత్మిక, తాత్విక, భక్తి సాక్షాత్కారం యోగా వల్ల కలుగుతుందన్నారు. 2023 అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని 'ఇంటర్నేషనల్ డే ఆఫ్ మిల్లెట్స్' అనే సందేశంతో ముందుకు వెళ్తుందన్నారు. సంపూర్ణ చిరుధాన్యాల ఆహారం మన భారతీయుల సంస్కృతి అని అన్నారు. విద్యార్థులు వ్యక్తిగత స్వయం సమృద్ధిని సాధించే దిశగా పయనించాలన్నారు.

ప్రపంచ దేశాలకు విశ్వగురు 'భారత్'

అఖిల భారతీయ రాష్ట్రీయ శైక్షిక్ మహాసంఘ్ జాతీయ సంయుక్త కార్యనిర్వాహక కార్యదర్శి గుంత లక్ష్మణ్ జీ మాట్లాడుతూ.. పూర్వకాలం నుంచి మన దేశం ప్రపంచదేశాలను శాసిస్తూ వస్తుందన్నారు. తరతరాల నుంచి ప్రపంచ దేశాలకు 'విశ్వ గురు'గా భారత్ మార్గదర్శిగా నిలుస్తుందన్నారు. సంస్కృతి, సంప్రదాయాల ఒరవడిలో ప్రపంచ దేశాలకు జ్ఞాన భిక్ష పెట్టిందన్నారు. వేదకాలం నుంచి భారతదేశం విజ్ఞానాన్ని, వైద్యాన్ని, ఖగోళ విశేషాలను అందించిందన్నారు. మన దేశం ప్రజాస్వామ్య విలువలకు మాతృభూమికగా నిలుస్తుందన్నారు. భారతదేశం వేగవంతంగా అభివృద్ధి చెందుతుందన్నారు. ఆర్థికాభివృద్ధిలో బ్రిటన్‌ను దాటి ప్రపంచ దేశాల్లో ఐదో స్థానం సాధించామన్నారు. యువతలో దేశభక్తి బీజాలను పెంపొందించే విధంగా కార్యక్రమాల నిర్వహణ ఉండాలని సూచించారు. ప్రతి ఒక్కరూ భారతీయ కుటుంబ విలువలకు గౌరవమివ్వాలని లక్ష్మణ్ జీ సూచించారు. అనంతరం తెయూ వీసీ రవీందర్ మాట్లాడుతూ.. యూజీసీ ఆదేశాల మేరకు తెయూలో జీ-20 జాతీయ సదస్సు నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. తెలంగాణ యూనివర్సిటీ బోధన, పరిశోధనా రంగాల్లో అభివృద్ధిని సాధిస్తుందన్నారు. సదస్సులో తెయూ ఇన్‌చార్జి రిజిస్ట్రార్ విద్యావర్ధిని, ప్రిన్సిపాల్ సీహెచ్ ఆరతి, సదస్సు డైరెక్టర్ సత్యానారాయణ, పాలకమండలి సభ్యులు కె.రవీందర్‌రెడ్డి, మారయ్యగౌడ్, నసీం, అధ్యాపకులు బి.శిరీష, వి.త్రివేణి, పీఆర్వో జమీల్ అహ్మద్, సీహెచ్ ఆంజనేయులు, ఇఫ్లూ యూనివర్సిటీ పీఆర్‌వో కె.రాజారాం, వివిధ విభాల అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక శోభితం..!



సండే స్పెషల్

పిలిస్తే పలికే ప్రత్యక్ష దైవం, కోరిన వరాలరాయడైన శ్రీ వేంకటేశ్వర స్వామి కొలువుదీరిన బీర్కూర్(తిమ్మాపూర్)లోని తిరుమల తిరుపతి దేవస్థానంలో శ్రీ లక్ష్మీ గోదా సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి వారి అష్టమ వార్షిక బ్రహ్మోత్సవాలు ఈనెల 26 నుంచి మార్చి 3 వరకు నిర్వహించనున్నారు. బ్రహ్మోత్సవాలకు మార్చి 1న సీఎం కేసీఆర్ రానున్నారు.
– సాక్షి, కామారెడ్డి/బాన్సువాడ టౌన్

1న బాన్సువాడకు సీఎం

- ఏర్పాట్లను పరిశీలించిన స్పీకర్



హెలీప్యాడ్ స్థలాన్ని పరిశీస్తున్న స్పీకర్ పోచారం

బాన్సువాడ టౌన్/బీర్కూర్ : వచ్చేనెల 1న సీఎం కేసీఆర్ బాన్సువాడకు రానున్నారు. ఈ సందర్భంగా బాన్సువాడ పట్టణంలోని వీక్లీ మార్కెట్‌కు వెళ్లే దారిలో హెలికాప్టర్ ల్యాండింగ్ అయ్యే ప్రాంతాన్ని శనివారం స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి పరిశీలించారు. తాడ్కోల్ శివారులో నూతనంగా నిర్మించిన 1000 డబుల్ బెడ్ రూం ఇళ్లను సీఎం ప్రారంభిస్తారని స్పీకర్ పేర్కొన్నారు. డబుల్ ఇళ్ల ప్రారంభం అనంతరం బీర్కూర్ తెలంగాణ తిరమల తిరుపతి దేవస్థానంలో జరిగే శ్రీలక్ష్మి గోదా సమేత వెంకటేశ్వర స్వామి అష్టమ వార్షిక బ్రహ్మోత్సవానికి సీఎం హాజరవుతారన్నారు. ఈ సందర్భంగా బాన్సువాడ, బీర్కూర్, నస్రుల్లాబాద్ మండలాల ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీలు, జెడ్పీటీసీలు, మండల పార్టీ అధ్యక్షులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు సాంఘిక సంక్షేమ సైనిక పాఠశాల ప్రవేశ పరీక్ష

డిచ్‌పల్లి: సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో కరీంనగర్ జిల్లా రుక్మాపూర్‌లో కొనసాగుతున్న సైనిక పాఠశాలలో ఆరో తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరం (ఎంపీసీ) ప్రవేశాలకు ఆదివారం పరీక్షను నిర్వహిస్తున్నట్లు సంస్థ రీజనల్ కోఆర్డినేటర్ విమేరీ యేసుపాదం ఒక ప్రకటనలో తెలిపారు. నిజామాబాద్ ఆర్సీవో పరిధిలో డిచ్‌పల్లి మండలం ధర్మారం(బి), భిక్కనూర్ (కామారెడ్డి), జామ్ (నిర్మల్)లోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలల్లో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. హాల్‌టికెట్‌ను www.tswreis.ac.in ద్వారా అభ్యర్థులు డౌన్‌లోడ్ చేసుకోవాల్సి ఉంటుందన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించాలి

డిచ్‌పల్లి: ఆర్థిక అక్షరాస్యతపై గ్రామీణ ప్రాంతంలోని మహిళా సంఘాల సభ్యులతో పాటు ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించాలని సెర్ప్ రిసోర్స్ పర్సన్ వెంకట్, డీపీఎం నీలిమ సూచించారు. డిచ్‌పల్లిలోని ఎస్‌బీఐ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ (ఆర్‌ఎస్‌ఈటీఐ)లో ఆరు రోజులుగా జిల్లాలోని 17 మండలాల నుంచి ఎంపిక చేసిన ఐకేపీ సీఏలకు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమం శనివారం ముగిసింది. శిక్షణ పూర్తి చేసుకున్న సీఏలకు సర్టిఫికెట్‌తో పాటు టూల్‌కిట్లు అందజేశారు. గ్రామాల్లోకి వెళ్లి ఆర్థిక అక్షరాస్యత, సైబర్ మోసాలపై అవగాహన కల్పించాలని సూచించారు. సంస్థ డైరెక్టర్ శ్రీనివాస్, సిబ్బంది భాగ్యలక్ష్మి, రామకృష్ణ, రంజిత్, నవీన్ పాల్గొన్నారు.

టౌన్‌ప్లానింగ్ అధికారిని సరెండర్ చేయాలి

వాడీవేడిగా బల్దియా సర్వసభ్య సమావేశం

కామారెడ్డి టౌన్ : కామారెడ్డి మున్సిపల్ సాధారణ సర్వసభ్య సమావేశం మున్సిపల్ చైర్‌పర్సన్ నిట్టు జాహ్నవి అధ్యక్షతన శనివారం కళాభారతి ఆడిటోరియంలో వాడీవేడిగా సాగింది. పట్టణంలోని సమస్యలపై అధికారులను కౌన్సిల్ సభ్యులు నిలదీశారు. 40 ఎజెండా అంశాలపై చర్చించారు. పట్టణంలోని ఇష్టారాజ్యంగా ఇంటి అనుమతులు ఇస్తున్నారని, రోడ్లు, ప్లాట్లు ఆక్రమణలకు గురవుతున్నా పట్టించుకోవడం లేదని టీపీఎస్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. డబ్బులు డిమాండ్ చేసే నిర్మాణాల వద్దకు పరిశీలన వెళ్తున్నారని, తాము అడిగితే మాత్రం తమకు అధికారం లేదని పేర్కొంటూ తప్పించుకుంటున్నారని బీఆర్‌ఎస్ కౌన్సిలర్‌లు టీపీఎస్ రాజేశ్‌ను నిలదీశారు. బల్దియా సిబ్బంది అక్రమ వసూళ్లు చేస్తూ కౌన్సిలర్లను బద్నాం చేస్తున్నారన్నారు. 50 ఫీట్ల రోడ్డు ఉంటేనే అనుమతివ్వాల్సి ఉండగా 15 ఫీట్ల ఆక్రమణలు గురవుతున్నా ఎలా అనుమతిలిచ్చావని అధికారిని నిలదీశారు. తక్షణమే టీపీఎస్‌ను ప్రభుత్వానికి సరెండర్ చేయాలని, తీర్మాణానికి పట్టుపట్టారు. చైర్‌పర్సన్ హామీతో శాంతించారు. 9వ అంశంలో జనరల్ ఫండ్ నిధులు పెట్టడంపై అభ్యంతరకం తెలిపారు. చివరకు 3 అంశాలను తిరస్కరించారు. కలెక్టర్ వద్దకు డీఈ, ఏఈలు వెళ్లడంతో ఇంజినీరింగ్ సమస్యలపై కౌన్సిల్ సభ్యులు అసహనం వ్యక్తం చేశారు. కమిషనర్ దేవేందర్, వైస్ చైర్‌పర్సన్ ఇందుప్రియా, బీఆర్‌ఎస్, బీజేపీ, కాంగ్రెస్ కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక శోభితం..!

- భక్తుల కొంగు బంగారం తెలంగాణ తిరుమల దేవస్థానం
- స్పీకర్ పోచారం చొరవతో ఆలయ అభివృద్ధి
- నేటి నుంచి బ్రహ్మోత్సవాలు
- మార్చి 1న సీఎం కేసీఆర్ రాక



గుట్ట కింద ఉన్న చెరువు

సండే స్పెషల్

సాక్షి, కామారెడ్డి: ఆలయమంటేనే ఆధ్యాత్మికతకు చిరునామా. అలాంటి ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రంగా తెలంగాణ తిరుమల దేవస్థానం నిత్య పూజలతో అలరారుతోంది. ఆలయ ధర్మకర్తగా బాన్సువాడ ఎమ్మెల్యే, స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి ప్రత్యేక చొరవతో ఆలయం ఎంతో అభివృద్ధి చెందింది. ఏడెనిమిదేళ్లలో రూ.23 కోట్ల వ్యయంతో ఆలయాన్ని అభివృద్ధి చేశారు. ఆధ్యాత్మిక కేంద్రంగా, పర్యాటక కేంద్రంగానూ తెలంగాణ తిరుమల దేవస్థానం అందరినీ ఆకర్షిస్తోంది. కాగా గుట్టపై ఉన్న తెలంగాణ తిరుమల దేవస్థానం వద్దకు వెళ్లి చూస్తే చుట్టూరా పచ్చని పంటలతో ఎంతో ఆహ్లాద వాతావరణం కనిపిస్తోంది. కనుచూపుమేర పచ్చని పంటలు ఉంటాయి. నిజాంసాగర్ ప్రాజెక్టు నీటితో ఆ ప్రాంతంలో వరి పంట పెద్ద ఎత్తున సాగవుతోంది.



తెలంగాణ తిరుమల దేవాలయం



ఆలయ విశిష్టత

ఎనిమిద దశాబ్దాల క్రితం తిమ్మాపూర్ గ్రామానికి చెందిన బ్రహ్మయ్యాచారి అనే వ్యక్తి కలలోకి వచ్చిన వెంకటేశ్వర స్వామి వారి అనుగ్రహం పొంది గుట్ట మీద స్వామి వారి విగ్రహాన్ని తయారు చేయించి గుడిసె కింద ఏర్పాటు చేశారని చెబుతారు. తర్వాత బాన్సువాడ సమీపంలోని కొత్తబాదికి చెందిన కొమురయ్యకు సంతానం కలగకుంటే స్వామివారిని దర్శనం చేసుకుని మొక్కుకున్నాడని, దీంతో ఆయనకు సంతానం కలగడంతో చిన్నగుడి నిర్మించాడని చెబుతారు. కొంతకాలానికి బీర్కూర్‌కు చెందిన వ్యాపారి బన్సిలాల్ ఇంట్లో దొంగలు పడి సొత్తు, బంగారం దోచుకెళ్లగా ఆయన స్వామివారికి మొక్కుకోగా పోయిన బంగారం దొరకడంతో మెట్లు నిర్మించాడని పేర్కొంటున్నారు. స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి పెద్ద కుమారుడికి సరిగా మాటలు రాకపోవడంతో స్వామివారికి మొక్కుకోగా, మాటలు రావడంతో పోచారం శ్రీనివాస్‌రెడ్డి కుటుంబ సభ్యులు ఆలయాభివృద్ధికి ముందుకు వచ్చారు. పోచారం శ్రీనివాస్‌రెడ్డితో పాటు ఆయన సోదరుడు శంభురెడ్డిలు ధర్మకర్తలుగా ఆలయాన్ని తీర్చిదిద్దేందుకు నడుంభిగించారు. వారికి అప్పారావు, సతీష్, నాగేశ్వర్‌రావ్, అశోక్ తదితరులు సహకారం అందించారు.

రూ.23 కోట్లతో ఆలయ నిర్మాణం

రాష్ట్రం ఏర్పాటైన తరువాత పోచారం శ్రీనివాస్‌రెడ్డి ఆలయ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టారు. ఆలయ నిర్మాణం చేపట్టారు. 2015లో విగ్రహ ప్రతిష్టాపన జరిగింది. 2016లో బ్రహ్మోత్సవాలకు సీఎం కేసీఆర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా రూ.10 కోట్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. సొంతంగా రూ.10 లక్షలు అందించారు. ఆ డబ్బుతో బస్సును కొనుగోలు చేసి రోడ్డు మీద నుంచి ఆలయానికి భక్తులను ఉచితంగా చేరవేస్తున్నారు. తరువాత మరో రూ.13 కోట్లు మంజూరు చేయించారు. మొత్తం రూ.23 కోట్ల వ్యయంతో ఆలయం ఎంతో అద్భుతంగా తయారైంది. ఆలయానికి రోడ్డు, అన్నదాన సత్రం, కాటేజీలు, గెస్ట్ హౌజ్‌లు నిర్మించారు. ఆలయానికి వెళ్లే గుట్ట మొదట్లో అలిపిరి గేటు నిర్మాణం చేపట్టారు. తిమ్మాపూర్ చెరువును అభివృద్ధి చేయడంతో పాటు అక్కడ బోటింగ్ సౌకర్యం ఏర్పాటు చేశారు.



అలిపిరి ద్వారం

నేటి నుంచి బ్రహ్మోత్సవాలు

తెలంగాణ తిరుమల దేవస్థానం బ్రహ్మోత్సవాలు 26 నుంచి మార్చి 3 వరకు నిర్వహించనున్నారు. 26న విష్ణు సహస్ర పారాయణం, పుణ్యాహవచనం, అంకురార్పణము, హోమనము వంటి కార్యక్రమాలు, 27న రామానుజ జీయర్ స్వామితో తీర్థగోష్టి, విశ్వక్సేన ఆరాధనం, ధ్వజారోహణం, స్వామి వారిచే ప్రవచనాలు, మాడ వీధులలో పెద్ద శేష వాహనంపై, సింహ వాహనంపై స్వామివారి ఊరేగింపు, 28న శ్రీ రామానుజ జీయర్ స్వామి వారితో తీర్థగోష్టి, శాంతి పాఠము, 1న శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి కల్యాణం, 2న శాంతిపాఠము, రథోత్సవం తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

ప్రొటోకాల్ ఉల్లంఘన

- గవర్నర్ పర్యటన నేపథ్యంలో జిల్లా ఉన్నతాధికారుల తీరు
- కన్నెత్తి చూడని కలెక్టర్, అదనపు కలెక్టర్లు, పోలీస్ కమిషనర్
- ఏబీఆర్‌ఎస్‌ఎం జాతీయ సంయుక్త కార్యనిర్వాహక కార్యదర్శికి అప్రాధాన్యత

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : రాజ్యాంగబద్ధమైన పదవిలో రాష్ట్ర ప్రథమ పౌరురాలుగా ఉన్న గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ శనివారం జిల్లా పర్యటనకు వచ్చిన నేపథ్యంలో అడుగడుగునా ప్రొటోకాల్ ఉల్లంఘన చోటుచేసుకుంది. గవర్నర్ తెలంగాణ వర్సిటీలో అఖిల భారతీయ రాష్ట్రీయ శైక్షిక్ మహాసంఘ్ సదస్సుకు ముఖ్య అతిథిగా వచ్చారు. ఈ క్రమంలో గవర్నర్‌ను ఆహ్వానించే విషయంలో జిల్లా ఉన్నతాధికారులు పట్టింపు లేకుండా వ్యవహరించడంపై విమర్శలు వస్తున్నాయి. కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, చిత్రామిశ్రా, సీపీ నాగరాజు, ఆర్డీవో రవి అందుబాటులో లేకుండా పోయారు. తూతూ మంత్రంగా బోధన్ ఆర్డీవో రాజేశ్వర్, డిచ్‌పల్లి తహసీల్దార్ శ్రీనివాసరావుతో గవర్నర్‌కు పుష్పగుచ్ఛం ఇచ్చి ఆహ్వానింపజేయడం గమనార్హం. కాగా గవర్నర్‌కు, రాష్ట్ర ప్రభుత్వానికి మధ్య పొరపొచ్చాలు ఉన్నప్పటికీ సివిల్ సర్వెంట్లుగా ఉన్న అధికారులు సైతం ఇలా వ్యవహరించడంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గతంలోనూ ఉన్నతాధికారులు ఇదేవిధంగా వ్యవహరించడం చూస్తుంటే కావాలనే ఇలా చేస్తున్నందుకు నిదర్శనమని విమర్శకులు అంటున్నారు. గతంలో బాసర ట్రిపుల్ ఐటీకి వెళ్లే సమయంలో గవర్నర్ తెలంగాణ వర్సిటీకి వచ్చారు. ఆ సమయంలో సైతం కలెక్టర్, సీపీ గవర్నర్‌కు ఆహ్వానం పలికే విషయంలో ప్రొటోకాల్ పాటించలేదు. దీంతో ఉన్నతాధికారులపై విమర్శల దాడి పెరుగుతోంది.

తెలంగాణ యూనివర్సిటీలో మరో చిత్రం చోటుచేసుకుంది. ఇక్కడ 'జీ 20' సదస్సును అఖిల భారతీయ రాష్ట్రీయ శైక్షిక్ మహాసంఘ్‌తో కలిసి నిర్వహించినప్పటికీ ఆ సంస్థ జాతీయ సంయుక్త కార్యనిర్వాహక కార్యదర్శి, సదస్సులో ప్రధాన వక్త అయిన గుంత లక్ష్మణ్‌కు తగిన ప్రాధాన్యత ఇవ్వకుండా ప్రవర్తించడంపై కూడా కొన్ని విద్యార్థి సంఘాల నాయకులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. సదస్సు నేపథ్యంలో గవర్నర్ పాల్గొన్న ప్రధాన వేదికపై గవర్నర్ పక్కన ఒకవైపు వీసీ, మరోవైపు గుంత లక్ష్మణ్ ఉండాల్సి ఉంది. అయితే కుడివైపు వైస్‌చాన్స్‌లర్ రవీందర్‌గుప్తా కూర్చున్నప్పటికీ, ఇందుకు విరుద్ధంగా ఎడమవైపు రిజిస్ట్రార్‌ను కూర్చోబెట్టారు. ఇదిలా ఉండగా వేదికపై వైస్ చాన్స్‌లర్ సతీమణి సైతం కూర్చున్నారు. ఆమె తరువాత చివరన గుంత లక్ష్మణ్‌ను కూర్చోబెట్టడంపై కొందరు విద్యార్థి సంఘాల నాయకులు గుర్రుగా ఉన్నారు.

శిశుమందిర్‌కు ఏడాది వేతనం విరాళం



సాక్షి, కామారెడ్డి : ఎల్లారెడ్డి పట్టణానికి చెందిన కంచర్ల రసజ్ఞ తనకు సాఫ్ట్‌వేర్ ఉద్యోగం వచ్చిన సందర్భంగా ఏడాది వేతనం రూ. 5.55 లక్షలు కామారెడ్డి పట్టణంలోని సరస్వతి శిశుమందిర్‌కు విరాళంగా అందించారు. శనివారం రాత్రి జరిగిన కార్యక్రమంలో వేతనాన్ని అందించగా రసజ్ఞను పలువురు అభినందించారు.

డీఏవో పరీక్షకు ఏర్పాట్లు

సుభాష్‌నగర్: తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్(టీఎస్‌పీఎస్సీ) ద్వారా నేడు జరగనున్న డివిజనల్ అకౌంట్స్ ఆఫీసర్ రాత పరీక్షకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. రాత పరీక్ష కోసం జిల్లా కేంద్రంలో 20 సెంటర్లు ఏర్పాటు చేశామని వివరించారు. ఉదయం 10.00 గంటల నుంచి మధ్యాహ్నం 12.30గంటల వరకు, తిరిగి మధ్యాహ్నం 2.30 గంటల నుంచి 5.00 గంటల వరకు రెండు సెషన్లలో పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు. www.tspsc.gov.in వెబ్‌సైట్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకున్న హాల్ టిక్కెట్లలో అభ్యర్థి ఫొటో, లేదా పేరులో ఏవైనా తప్పిదాలు ఉంటే మూడు పాస్‌పోర్ట్ సైజు ఫొటోల మీద గెజిటెడ్ అధికారి సంతకంతో పరీక్షా కేంద్రాలకు హాజరుకావాలని సూచించారు.

పథకాల అమలులో తెలంగాణ ఆదర్శం



స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డికి గొర్రెపిల్లను బహూకరిస్తున్న గొల్లకుర్మలు

బాన్సువాడ టౌన్ : సంక్షేమ పథకాల అమలులో ఇతర రాష్ట్రాలకు తెలంగాణ ఆదర్శంగా నిలుస్తోందని స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం బాన్సువాడ రెడ్డి సంఘంలో గొల్ల, కుర్మ కులస్తుల ఆత్మీయ సమ్మేళనానికి స్పీకర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వలసలను నియంత్రించి వ్యవసాయానికి అధిక ప్రాధాన్యత ఇచ్చిన ఘనత తెలంగాణకే దక్కిందని, ప్రభుత్వం కులవృత్తులను ప్రోత్సహించేందుకు గొల్ల, కుర్మ కులస్తులకు సబ్సిడీపై గొర్రెలను పంపిణీ చేసిందన్నారు. దీంతో గొల్ల, కుర్మ కులస్తులు ఎంతో ఆర్థికాభివృద్ధి చెందారని అన్నారు. రాష్ట్రంలో అమలుచేస్తున్న పథకాలను పక్క రాష్ట్రాల వారు అమలు చేస్తున్నారని. తెలంగాణలో జరుగుతున్న అభివృద్ధి కొందరికి కనబడడం లేదని, బీజేపీ నాయకులు అభివృద్ధి చేసి మాట్లాడాలన్నారు. అనంతరం గొర్రె పిల్లను స్పీకర్‌కు బహూకరించారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి, గొల్లకుర్మ నాయకులు గంగుల గంగారం, పర్వుగొండ తదితరులు ఉన్నారు.

కుక్కల సమస్యను పరిష్కరిస్తాం

బాన్సువాడ మున్సిపాలిటీ పరిధిలో కుక్కలు, పారిశుధ్యం, ఇతర సమస్యలపై బాన్సువాడ మున్సిపల్ కమిషనర్ రమేశ్‌తో శనివారం 'సాక్షి' ఫోన్ ఇన్ కార్యక్రమం నిర్వహించగా అనూహ్యస్పందన లభించింది. ప్రజలు తమ పరిధిలోని సమస్యలు, ఇబ్బందులపై నేరుగా కమిషనర్‌కు ఫోన్ చేసి పిర్యాదు చేశారు. కమిషనర్ పరిష్కార మార్గాలను సూచించారు. – బాన్సువాడ టౌన్

సాక్షి ఫోన్ ఇన్

- 'సాక్షి' ఫోన్‌ఇన్‌కు స్పందన
- ఫిర్యాదులు స్వీకరించిన కమిషనర్ రమేశ్



నార్ల రాఘవేందర్ : గాంధీచౌక్‌లో వీధి కుక్కలు విచ్చలవిడిగా సంచరిస్తున్నాయి. రోడ్డుపై ప్రజలు వెళ్తుంటే వారి వెంట పడుతున్నాయి. హనుమాన్ మందిర్, పాత అంగడిబజార్‌లో మంచినీటి సమస్య తీవ్రంగా ఉంది.

కమిషనర్: వారం రోజుల్లో కుక్కలను పట్టించి ఇతర ప్రాంతాలకు పంపిస్తున్నాం. రెండు రోజుల్లో మంచి నీటి సమస్యను పరిష్కరిస్తాం.

■ పాత బాన్సువాడ నుంచి బస్టాండ్‌కు వెళ్లే దారిలో ఉదయం, రాత్రివేళల్లో కుక్కలు రోడ్డుపై వెళ్లేవారి వెంటబడుతున్నాయి. పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు ఈ రోడ్డుపై వెళ్లాలంటే భయపడుతున్నారు. – దుబాస్ రాములు

■ పాత బాన్సువాడకు వెళ్లే దారిలో ఉన్న కుక్కలను ఇతర ప్రాంతాలకు తరలించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. గతంలో కొత్త బాన్సువాడలో సమస్యను పరిష్కరించాం. ఇప్పుడు పాత బాన్సువాడలో ఉన్న కుక్కల సమస్యను పరిష్కరిస్తాం.

■ సంగమేశ్వర కాలనీలో పందులు, కుక్కల బెడద చాలా ఉంది. చాలసార్లు మున్సిపాలిటీలో పిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదు. – ఖలీల్

■ పాత బాన్సువాడకు సరఫరా అయ్యే మంచి నీటిలో పురుగులు వస్తున్నాయి. చాలాచోట్ల మిషన్ భగీరథ పైపులైన్ వేయలేదు. నల్లాలు కూడా పెట్టలేదు. దోమలు చాలా ఉన్నాయి. మున్సిపాలిటీ అయ్యాకే నీళ్లల్లో పురుగులొస్తున్నాయి. – కోనాల గంగారెడ్డి

■ పాత బాన్సువాడలో చాలా ఏళ్ల క్రితం పైపులైన్ వేశారు. అందుకే మంచినీళ్లు కలుషితం అవుతున్నాయి. త్వరలో కొత్త పైపులైన్ వేయిస్తాం. అన్ని వార్డుల్లో మిషన్ భగీరథ కుళాయిలు పెట్టేందుకు చర్యలు తీసుకుంటున్నాం. రెండ్రోజులకొకసారి దోమల మందు పిచికారి చేయిస్తాం.

■ వారం రోజుల్లో కుక్కలను, పందులను బాన్సువాడ నుంచి ఇతర ప్రాంతాలకు తరలించేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

■ బాన్సువాడ పట్టణంలో ఖాళీ స్థలాలు ఉన్నచోట దోమలు వృద్ధి చెంది రాత్రిళ్లు ఇళ్లలోకి వస్తున్నాయి. – ప్రవీణ్‌గౌడ్

■ రెండు రోజులకొక సారి దోమల మందును పిచికారి చేయిస్తాం.

■ పట్టణంలో ప్రధాన రహదారి వెంట ఫుట్‌పాత్‌లపై ఉన్న వాహనాలను తొలగించాలి. రోడ్లపై వ్యాపారాలు చేయడంతో ప్రజల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. – శ్రీనివాస్

■ ప్రధాన రహదారిపై చిరు వ్యాపారుల తోపుడు బండ్లను తొలగించేందుకు చర్యలు తీసుకుంటాం.

యువతకు ఉచిత శిక్షణ

నిజామాబాద్‌నాగారం: నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో డిచ్‌పల్లిలోని ఎస్‌బీఐ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థలో యువతకు శిక్షణ ఇస్తున్నట్లు జిల్లా యువజన అధికారి బెల్లాల్ శైలి తెలిపారు. మార్చి 1 నుంచి 3వ తేది వరకు ఈ శిక్షణ ఉంటుందన్నారు. యువ నాయకత్వ, సామాజిక అభివృద్ధి అంశాల్లో శిక్షణ ఇస్తారని పేర్కొన్నారు. నిజామాబాద్‌కుచెందిన 18–29 ఏళ్లలోపు వారు అర్హులని తెలిపారు. ఈ నెల 28లోపు 9100435410 నంబర్‌కు ఫోన్ చేసి నమోదు చేసుకోవాలన్నారు.

క్రైం కార్నర్

అనారోగ్యంతో వృద్ధురాలి ఆత్మహత్య



అన్నవ్వ (ఫైల్)

నాగిరెడ్డిపేట: మండలంలోని పెద్ద ఆత్మకూర్ గ్రామానికి చెందిన యాటకారి అన్నవ్వ (71) శుక్రవారం బాత్‌రూంలను శుభ్రం చేసే యాసిడ్ తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. వివరాలు.. అన్నవ్వకు కొంత కాలం క్రితం వెన్నుముకకు సంబంధించిన ఆపరేషన్ జరిగింది. అప్పటి నుంచి ఆమె అనారోగ్యంతో బాధపడుతుంది. శుక్రవారం అన్నవ్వ యాసిడ్ తాగి బాత్‌రూం పక్కన పడి ఉండడంతో గమనించిన కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించారు. వైద్యుడి సూచనల మేరకు హైద్రాబాద్ గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం వేకువజామున మృతి చెందినట్లు వారు తెలిపారు. మృతురాలి కుమార్తె విజయ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు.

వరద కాలువలో పడి ఒకరి మృతి

మోర్తాడ్: మోర్తాడ్ మండలం తిమ్మాపూర్ శివారులోని వరద కాలువలో పడి పాలెంకు చెందిన బడిగె సుమన్(38) మరణించాడు. వరద కాలువలో పంపుసెట్టు మరమ్మతుల కోసం దిగిన సుమన్ ప్రమాదవశాత్తు అందులో పడి పోవడంతో మరణించాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ముత్యం రాజు తెలిపారు.

టిప్పర్ ఢీకొని మహిళ..

మాక్లూర్: రోడ్డు దాటుతుండగా టిప్పర్ ఢీకొని మహిళ మృతి చెందిన సంఘటన శనివారం రాత్రి మండలంలోని అడవి మామిడిపల్లిలో చోటు చేసుకుంది. ఎస్సై యాదగిరిగౌడ్ కథనం మేరకు.. గంగరమందకు చెందిన ఎల్లవ్వ(50) బంధువులు అడవి మామిడిపల్లిలో నిర్వహించిన ఓ శుభకార్యానికి హాజరై తిరిగి స్వగ్రామానికి వెళ్తుండగా ఈ ఘటన జరిగింది. రాత్రి సుమారు 8 గంటల సమయంలో మామిడిపల్లిలోని బస్టాప్ వద్ద రోడ్డు దాటుతుండా వేగంగా వెళ్తున్న టిప్పర్ ఎల్లవ్వను ఢీకొట్టింది. దీంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

భర్తను చంపిన భార్య అరెస్ట్

బోధన్‌టౌన్: రోజు మద్యం తాగి వేధిస్తున్న భర్త బక్కొళ్ల బాలును చంపిన కేసులో గౌతమిని శనివారం రిమాండ్‌కు తరలించినట్లు పట్టణ సీఐ ప్రేమ్‌కుమార్ తెలిపారు. బాలు తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితురాలిని అరెస్టు చేశామన్నారు.

అర్థంకాని ఆదాయ వ్యయాలు

- పట్టణ సమస్యలపై నిలదీసిన కౌన్సిల్ సభ్యులు
- టౌన్‌ప్లానింగ్, ఇంజినీరింగ్ శాఖల తీరుపై ఆగ్రహం
- సరైన సమాధానాలు చెప్పని అధికారులు
- కామారెడ్డి బల్దాయా బడ్జెట్‌కు ఆమోదం



మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

కామారెడ్డి టౌన్ : కామారెడ్డి మున్సిపల్ 2023–24 బడ్జెట్‌ను మమ అనిపించారు. ఆదాయ వ్యయాలు సమానంగా ఉండడంతో కౌన్సిలర్లంతా అయోమయానికి గురయ్యారు. శనివారం జిల్లా కేంద్రంలోని కళాభారతి ఆడిటోరియంలో మున్సిపల్ చైర్‌పర్సన్ నిట్టు జాహ్నవి అధ్యక్షతన బడ్జెట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ హాజరయ్యారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటలకు వాడీవేడిగా సమావేశం జరిగింది. అయితే బడ్జెట్ వివరాలు సమావేశంలో పాల్గొన్నవారికి ఏమాత్రం అర్థం కాకుండా కాకి లెక్కలు చూపించారు. ఈ యేడు ఆదాయం, వ్యయం సమానంగా చూపారు. పట్టణ సమస్యలపై అధికారులను నీలదీసారు. సభ్యుల ప్రశ్నలకు సరైన సమాధానం చెప్పలేకపోయారు.

ఇవేం లెక్కలు..

2023–24కు సంబంధించి అంచనా బడ్జెట్‌ను కమిషనర్, అకౌంటెంట్ అధికారులు సమావేశంలో చదివి వినిపించారు. గతేడాది అంచనా ప్రారంభ నిల్వ రూ. 2,566.65 లక్షలు చూపించారు. 2023–24 అంచనాల ఆదాయం రూ. 4,858.47 లక్షల లెక్కలు వేశారు. గతేడాది నిల్వ ఈ ఏడాది ఆదాయం మొత్తం రూ. 7425.12 లక్షలు వేశారు. అలాగే సాధారణ వ్యయం రూ. 4,858.47 లక్షలు చూపించగా మిగులు బడ్జెట్ రూ. 2,566.65గా చూపారు. ఆదాయం వ్యయం సమానంగా చూపడంతో ఇవేం లెక్కలని పలువులు అయోమయానికి గురయ్యారు.

అయోమయంలో అధికారులు..

మున్సిపల్ నుంచి ఇచ్చే వీఎల్‌టీ ధ్రువపత్రాలు లేకుండా రిజిస్ట్రేషన్ కార్యాలయంలో నిత్యం 20, 30 వరకు ప్లాట్లకు రిజిస్ట్రేషన్‌ను జరుగుతున్నాయని అంజల్‌రెడ్డి కౌన్సిలర్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. నిత్యం 1, 2 మాత్రమే మున్సిపల్‌లో వీఎల్‌టీలు ఇస్తున్నారన్నారు. విలీన గ్రామాలకు సరైన నిధులు కేటాయించాలని కౌన్సిలర్ శ్రీకాంత్ కోరారు. అమృత్ గ్రాంట్ నిధులు రూ. 40 కోట్లు రాకున్నా వచ్చినట్లు బడ్జెట్‌లో పెట్టడం సరికాదన్నారు. పట్టణంలోని మున్సిపల్ ఓపెన్ స్థలాలు కాపాడాలని కౌన్సిలర్ వంశీకృష్ణ ప్లకార్డును ప్రదర్శించి నిరసన వ్యక్తం చేశారు. అశోక్‌నగర్‌లో ఓపెన్ స్థలంలో ఇళ్లు నిర్మించినా టౌన్‌ప్లానింగ్ అధికారులు పట్టించుకోలేదన్నారు. లేఅవుట్ ప్లాట్లలో బల్దియాకు ఓపెన్ స్థలాలు వదలాల్సి ఉండగా వదలకుండా వెంచర్లు చేస్తున్నారని నజీరొద్దీన్ నిలదీశారు. గతంతో కౌన్సిల్ తీరుపై డీసెంట్ నోటీస్‌లు ఇచ్చినా స్పందన లేదని కలెక్టర్‌కు కొందరు బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు ప్రశ్నించారు. టౌన్‌ప్లానింగ్, ఇంజినీరింగ్ శాఖలను ప్రక్షాలన చేయాలని సభ్యులు కోరారు. తమ వార్డుకు రూ.40 లక్షలు మంజూరైతే రూ. 25 లక్షల పనులు చేశారని మిగితా పనులు చేయమంటే నిధులు లేవని చెబుతున్నారని కౌన్సిలర్ భుక్యా రాజు వాపోయాడు. ఆర్‌టీఐ కింద దరఖాస్తు చేస్తే కరెంట్ బిల్లులకు చెల్లించాలని అధికారులు చెప్పారన్నారు. తాము ఇక చైర్‌పర్సన్, కమీషనర్ కాళ్లు మొక్కుతామని ఆవేదన వ్యక్తం చేశారు. కమిషనర్, డీఈలు ఒక బొమ్మలాగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. సభ్యులు అడిగిన ప్రశ్నలకు అధికారులు సరైనా సమాధాలు ఇవ్వకపోవడంతో మండిపడ్డారు.

ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దాలి

కామారెడ్డిని ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. పట్టణ ప్రజలకు అవసరమైన పనులను గుర్తించి బడ్జెట్ ను వినియోగించాలని తెలిపారు. మున్సిపల్ కౌన్సిలర్లు, అధికారులు సమిష్టిగా కృషి చేయాలన్నారు. పట్టణంలో నీటి ఎద్దడిని పరిష్కరించడానికి ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ ఇందు ప్రియ, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.



బడ్జెట్‌కు ఆమోదం తెలుపుతున్న సభ్యులు